క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం



నవీపేట(బోధన్): బినోలలో ముత్యాలమ్మ మందిర పునర్నిర్మాణానికి తన వంతుగా రూ.25 వేలను సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాండ్లు గురువారం అందజేశారు. గోదావరి నది తీరాన ఉన్న బినోలలో అతి పురాతన ఆలయాలు చాలా ఉన్నాయి. ప్రతి ఏడాది ఒక ఆలయాన్ని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది ముత్యాలమ్మ ఆలయాన్ని పునర్నిర్మాణం చేయించి విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నారు.

వ్యాధితో బాధపడుతున్న విద్యార్థికి..



ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలో పదవ తరగతి చదువుతున్న లక్ష్మణ్ అనే విద్యార్థి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతుండటంతో నిజామాబాద్ నుడా డైరెక్టర్ అంబదాస్ రావు గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. చదువులో మంచి నేర్పరిగా ఉన్న విద్యార్థి, వ్యాధితో బాధపడుతూ ఇంట్లో ఉండడంతో తన వంతు సహాయంగా స్టడీ మెటీరియల్, పౌష్టికాహారం అందజేశారు. మెరుగైన వైద్యం కోసం అర్బన్ ఎమ్మెల్యే గణేష్ గుప్తాతో మాట్లాడి వైద్య సహాయం అందజేస్తామన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయురాలు అపర్ణ ఉన్నారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



భీమ్‌గల్: మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా భీమ్‌గల్ పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు గురువారం ప్రారంభించారు. కలెక్టర్ హనుమంతు మాట్లాడుతూ.. పాఠశాలలో మౌలిక వసతుల కోసం మన ఊరు– మన బడి కింద ఏటా రూ.7 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం న్యాక్ శిక్షణ కేంద్రాన్ని, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించారు. మున్సిపల్ చైర్ పర్సన్ కన్నె ప్రేమలత, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ రాజేందర్, తహసీల్దార్ శ్రీధర్ ఉన్నారు.

'రోటరీ' ఆవిర్భావ వేడుకలు



ఆర్మూర్ టౌన్: పట్టణంలోని రోటరీ కార్యాలయంలో గురువారం రోటరీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా రోటరీ అసిస్టెంట్ గవర్నర్ విజయసారథి పాల్గొని మాట్లాడారు. రోటరి క్లబ్ 118 సంవత్సరాల చరిత్రలో ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం రోటరీ సభ్యుల సమక్షంలో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

నిలిచిన పసుపు కొనుగోళ్లు



ఇందూరు(నిజామాబాద్ అర్బన్): ఆదాయ పన్ను శాఖ తమపై పన్ను విధించడాన్ని నిరసిస్తూ జిల్లా మర్చంట్ అసోసియేషన్ ఇచ్చిన బంద్ కారణంగా నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో గురువారం కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఒక రోజు ముందుగానే మార్కెట్ అధికారులు పసుపు కొనుగోళ్లు పూర్తి చేయించారు. బుధవారం రాత్రి 11 గంటల వరకు కూడా తూకం వేశారు. అయితే గురువారం ఎలాంటి పంట క్రయ, విక్రయాలు జరగలేదు. కమీషన్ ఏజెంట్ల నిరసనతో మార్కెట్‌లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఎక్కడ చూసినా పసుపు నింపిన బస్తాలే కనిపించాయి. శుక్రవారం యథావిధిగా పసుపు కొనుగోళ్లు జరుగనున్నాయి.

వంతెన కథ ఒడిసినట్టేనా?

- ఏడేళ్లు గడిచినా పూర్తికాని వైనం
- రూ.3 కోట్ల 20 లక్షలతో పనులు
- అర్ధాంతరంగా ఆగడంతో ఇబ్బందులు

బోధన్ : పెద్దమావంది శివారులో పసుపు వాగుపై రైతుల సౌకర్యార్థం చేపట్టిన హైలెవల్ వంతెన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఏడేళ్లు గడిచినా పనులు పూర్తి కాలేదు. రూ.కోట్లు వెచ్చించినా వంతెన ఉపయోగంలోకి రాలేదు. వంతెనపై రైతులు పెట్టుకున్న ఆశలు ఆవిరవుతున్నాయి. 2015–16 సంవత్సరంలో వంతెన నిర్మాణం కోసం నాబార్డు ద్వారా రూ.3 కోట్ల 20 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. పంచాయత్‌రాజ్ ఇంజనీరింగ్ విభాగం టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులను కాంట్రాక్టరుకు అప్పగించారు. అప్పటోనే వంతెన పనులు ప్రారంభించడంలోనే జాప్యం చోటు చేసుకుంది. క్రమంగా పనులు మొదలు పెట్టి దశల వారీగా కొనసాగించారు. వాగుపై 12పిల్లర్లతో వంతెన పనులు చేపట్టగా 10 పిల్లర్ల వరకు స్లాబ్ పనులు పూర్తయ్యాయి. మిగిలిన రెండు పిల్లర మేరకు స్లాబ్, వంతెనకు ఇరువైపులా రోడ్డు నిర్మాణ పనులు మిగిలిపోయాయి. వంతెన పనులను త్వరితగతిన పూర్తి చేయడంలో నిర్లక్ష్యం జరిగినందునే అంచనా వ్యయం పెరిగి నిధుల కొరత సమస్య ఏర్పడిందనే ఆరోపణలున్నాయి.



బోధన్ మండలం పెద్దమావంది గ్రామ పసుపు వాగుపై నిర్మాణంలో ఉన్న హైలెవల్ వంతెన

నాలుగేళ్లుగా అదనపు నిధులకు ప్రతిపాదనలు

మిగిలిన పనులను పూర్తి చేసేందుకు రూ.కోటితో అదనపు నిధుల మంజూరుకు ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపించామని నాలుగేళ్లుగా అధికారులు చెప్పుకొస్తున్నా ఇప్పటికీ నిధులు మంజూరు కాలేదు. ఎప్పుడు మంజూరవుతాయో తెలియదు.



వంతెన పూర్తి కాక.. పసుపు వాగులో నుంచి అవతలి ఒడ్డుకు ఎరువులతో వెళ్తున్న ట్రాక్టర్

వంతెన నిర్మాణం ఎందుకంటే

పెద్దమావంది, బండారుపల్లి గ్రామాల రైతులకు సాగు భూములు 200 ఎకరాల వరకు ఉంటాయి. వర్షాకాలంలో వాగు వరద ఉధృతి వల్ల వ్యవసాయ పనులకు ఒడ్డు దాటి వెళ్లే పరిస్థితి ఉండదు. ఈ రెండు గ్రామాల పంట పొలాలకు వెళ్లాలంటే 10కిలో మీటర్ల దూరం చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దీనివల్ల ఆర్థికంగా, దూరభారం అవుతోంది. రైతులు ఎదుర్కొంటున్న సాగు కష్టాలను పరిష్కరించేందుకు వంతెన నిర్మాణం ఆలోచన రూపుదిద్దుకుంది.

వంతెన పనులు పూర్తి చేయాలి



వాగుపై వంతెన పనులు మధ్యలోనే ఆగిపోయి చాలా కాలం అవుతోంది. వంతెన పనులు పూర్తయితే ఆర్థిక కష్టాలు తీరతాయి. వాగు ఒడ్డున 10 ఎకరాల కొలు భూమి ఉంది. వర్షాకాలంలో పొలం పనులకు వెళ్లేందుకు తీవ్రకష్టాలు పడుతున్నాం.

– పులి సాయిలు, పెద్దమావంది, బోధన్

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



మా కుటుంబానికి 20 ఎకరాల వరకు వాగు ఒడ్డున సాగు భూములున్నాయి. వర్షాకాలంలో వరద నీటివల్ల వాగు దాటి వెళ్లే పరిస్థితి లేకుండా పోతోంది. తమ గ్రామం నుంచి బోధన్ మీదుగా వెళ్లాలంటే 10 కిలోమీటర్ల దూరం అవుతుంది. వంతెన పనులు పూర్తి చేసి కష్టాలు తీర్చాలి.

– విఠల్ పటేల్, బండారుపల్లి, బోధన్

మస్కట్ జైలు నుంచి విడిపించండి



వినతిపత్రం అందజేస్తున్న బాధిత కుటుంబసభ్యులు

పెర్కిట్(ఆర్మూర్): ఏజెంటు మోసం వల్ల మస్కట్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఏర్గట్ల మండలం దోంచంద గ్రామానికి చెందిన యువకులను విడిపించాలని కుటుంబ సభ్యులు గురువారం ఆర్మూర్‌లో ప్రవాస భారతీయుల సంక్షేమ, హక్కుల వేదిక వ్యవస్థాపకుడు కోటపాటి నర్సింహ నాయుడుకు వినతి పత్రం అందజేశారు. మెట్‌పల్లికి చెందిన నకిలీ ఏజెంటు దోంచందకు చెందిన రఘునాథ్, హరీష్ నుంచి రూ.లక్ష చొప్పున తీసుకుని మస్కట్ పంపించాడు. ఇద్దరికి 21 ఏళ్ల మాత్రమే ఉన్నాయి. భారతీయులకు 22 ఏళ్లు నిండితే రెసిడెన్స్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఆ సర్టిఫికెట్ ఉంటే మస్కట్‌లో ఉద్యోగాలను పర్మినెంటు చేస్తారని నమ్మబలికి విజిటింగ్ వీసా మీద అక్కడ పది నెలలు పని చేయించుకున్నాడు. కానీ వర్క్ పర్మిట్ వీసా మాత్రం ఇప్పించలేదు. వీసాలు రాలేదని, త్వరగా ఇండియాకు వెళ్లాలంటే పోలీసులకు పట్టుబడాలని వారికి చెప్పి జైలు పాలు చేసినట్లు బాధితులు తెలిపారు. బాధితులు రెండు నెలలుగా మస్కట్ జైలులో ఉన్నా ఏజెంటు పట్టించుకోకపోవడంతో కుటుంబ సభ్యులు కోటపాటిని కలిసి బాధలు చెప్పుకున్నారు. దీంతో ఆయన ఎంబసీ అధికారులతో మాట్లాడి బాధితులను ఇండియాకు రప్పించడానికి చర్యలు తీసుకుంటానని బాధితులకు హామీ ఇచ్చాడు.

'జిల్లా ఏర్పాటుకు అన్ని అర్హతలున్నాయి'

- 67వ రోజు కొనసాగిన దీక్షలు



బోధన్: ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు బోధన్‌కు అన్ని అర్హతలున్నాయని న్యాయవాదులు అన్నారు. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను గుర్తించి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించాల్సిందిపోయి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక జిల్లా కోసం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 67వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో న్యాయవాదులు గంగారెడ్డి, రమేష్, శంకర్‌లు కూర్చున్నారు. న్యాయవాదులు సీహెచ్ హన్మంత్‌రావు, అడ్లూరి శ్రీనివాస్‌లు దీక్షలను ప్రారంభించారు. పలు ప్రజా సంఘాల నాయకులు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

నేలను బట్టి పంటలు సాగు చేయాలి

- జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు సుధారాణి



మాట్లాడుతున్న డాక్టర్ సుధారాణి

బోధన్/రుద్రూర్: నేల ఆరోగ్యం, వనరుల సుస్థిరతను దృష్టిలో ఉంచుకొని పంటల సాగు చేపట్టాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు సుధారాణి రైతులకు సూచించారు. గురువారం రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన శాస్త్రీయ సలహా సంఘం, జిల్లా స్థాయి సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ.. శాస్త్రవేత్తలు చేపట్టిన విస్తరణ కార్యక్రమాలు, ప్రథమ శ్రేణి ప్రదర్శనలు రైతుల పొలాల్లో అవలంబించాలని తెలిపారు. సహ పరిశోధన సంచాలకులు శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతులు సమీకృత వ్యవసాయం, విత్తన ఉత్పత్తి, పంటల మార్పిడి వంటి పద్ధతులు పాటించి ఉత్తమ ఫలితాలు పొందాలని సూచించారు. అలాగే పలువురు శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడారు. రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతి బాలాజీ నాయక్, సుందరేశన్ పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులపై ఫిర్యాదు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపాలిటీ అధికారులపై జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గంగాధర్ గౌడ్ ఫిర్యాదు చేశారు. పట్టణ ప్రగతి, హరితహారం, 14, 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు వివిధ పన్నుల ద్వారా వచ్చిన ఆదాయం, ఖర్చుల వివరాలు ఇవ్వాలని, నెల రోజుల క్రితం సమాచర హక్కు చట్టం–2005 ప్రకారం అధికారులను కోరామని, నెల రోజులవుతున్నా సంబంధిత శాఖ అధికారి సమాచారం ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైన సమాచార హక్కు చట్టం ప్రకారం కోరిన సమాచారం ఇవ్వాలని, లేని పక్షంలో రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు.

రాణంపల్లిలో అగ్రికల్చర్ విద్యార్థుల పర్యటన



రాణంపల్లిలో పటంతో వివరిస్తున్న విద్యార్థులు

రుద్రూర్: రాణంపల్లిలో జగిత్యాలకు చెందిన అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం(రావెప్)లో భాగంగా గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక తులనం(పీఆర్ఏ) చేశారు. సేద్యంలో గ్రామ రైతులు అనుభవాలు, గ్రామ స్థితిగతులు, వనరులు, జీవనోపాధి గురించి తెలుసుకున్నారు. వ్యవసాయ విద్య అభ్యాసనలో భాగంగా క్షేత్ర పర్యటన చేస్తామని సహకరించాల్సిందిగా కోరారు. అనంతరం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను సూచించారు. సర్పంచ్ రోజా, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు విజయ్, రాజ్‌కుమార్, సురేష్ అభ్యుదయ రైతులు ఎస్ఎల్ ప్రసాద్, మహేందర్, గోపి, సురేష్ పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు ఇప్పించండి



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కార్మికులకు 8 ఏళ్ల నుంచి వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బకాయి వేతనాలు ఇప్పించాలని ఎంపీ అర్వింద్‌ను కార్మికులు కోరారు. గురువారం బోధన్‌కు వచ్చిన ఎంపీని కార్మికులు కలిసి వినతి పత్రం అందజేశారు. వేతనాలు రాక 305 మంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే ఫ్యాక్టరీని తెరిపించాలని, లేని పక్షంలో ఇతర శాఖల్లో కార్మికులకు ఉద్యోగం కల్పించాలని కోరారు. ఎంపీ మట్లా డుతూ.. నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ కార్మికులకు వేత నాలు ఇచ్చే పరిస్థితుల్లో సైతం ప్రభుత్వం లేదని విమర్శించారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



అద్దాలు అందజేస్తున్న రాజేశ్వర్ రెడ్డి, పక్కన వినీత

ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, బీఆర్ఎస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని 9, 12, 30వ వార్డులలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంటి సమస్యలు ఉన్న ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, అద్దాలు పంపిణీ చేస్తున్నామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, కౌన్సిలర్లు తాటి హన్మాండ్లు, శివ, సూపర్‌వైజర్ చంద్రశేఖర్, సానిటరి ఎస్సై మహేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో గురడి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు రెండో రోజు గురువారం కొనసాగాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సమాచారం..

రేపు మండల సర్వ సభ్య సమావేశం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఎంపీపీ పస్క నర్సయ్య అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

రైతుల ముసుగులో రాజకీయం తగదు



వేల్పూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

వేల్పూర్: పంటల ధరలపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు రైతుల ముసుగులో రాజకీయం చేస్తున్నారని వేల్పూర్ మండల బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. జిల్లా రైతుబంధు నాయకుడు మిట్టపల్లి మహిపాల్, రేగుల్లరాములు, నాగధర్‌రెడ్డి, నల్లరమేశ్, ప్రతాప్‌రెడ్డి, లింబారెడ్డి, తదితరులు వేల్పూర్ బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. సీ ఎం కేసీఆర్, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి గురించి మాట్లాడే అర్హత వారికి లేదన్నారు. పంటలు చేతికి వచ్చి వ్యాపారులు కొనుగోలు చేసే వరకు నిద్రలో ఉన్నారా? అని ప్రశ్నించారు. వ్యాపారులు ఎర్రజొన్నలను తక్కువ ధరకు కొనుగోలు చేస్తే కఠిన చర్య లు తీసుకోవాలని మంత్రి ప్రశాంత్‌రెడ్డి కలెక్టర్‌ను ఆదేశించిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

జీవాలకు 'నట్టల' మందు వేయించాలి



నట్టల మందు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి జగన్నాథచారి

- జిల్లా పశు సంవర్ధక అధికారి జగన్నాథచారి

రుద్రూర్: జీవాల పెంపకం దారులు గొర్రెలు, మేకలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందు వేయించాలని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి జగన్నాథచారి సూచించారు. రుద్రూర్ మండలం చిక్కడపల్లి, మోస్రా మండలం గోవూర్ గ్రామాల్లో వెటర్నరి సిబ్బంది జీవాలకు వేస్తున్న నట్టల మందు కార్యక్రమానికి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 8 లక్షల జీవాలకు నట్టల నివారణ మందును ఈ నెల 28 వరకు వేయాలనే లక్ష్యంతో వెటర్నరి సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తున్నారని అన్నారు. నట్టల వల్ల జీవాల్లో ఎదుగుదల ఉండదని, మందు తాగించడం వల్ల అంతర పరాన్నజీవులు, బాహ్య పరాన్నజీవులు నశించి జీవాలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. పాడి రైతులు పశుగ్రాసం పెంచుకోవాలని, ఇందుకు 75శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందజేస్తామన్నారు. వెటర్నరి కేసీసీ కార్డుదారులకు 7 శాతం వడ్డీపై రుణ సౌకర్యం అందిస్తామన్నారు.

ముప్కాల్ మండలం రెంజర్లలో..



రెంజర్లలో మందు వేస్తున్న వైస్ ఎంపీపీ రాజన్న

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను గురువారం వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ మగ్గిడి మోహన్, పశు వైద్యుడు ప్రణీత్ పాల్గొన్నారు.



మాక్లూర్‌లో ..

మాక్లూర్ పరిధిలో..

మాక్లూర్: మండలంలోని మాక్లూర్, మాదాపూర్, బోర్గాం(కె) గ్రామాలలో 11,881 గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందులు తాగించారు. మాక్లూర్ సర్పంచ్ అశోక్, ఎంపీటీసీ వెంకటేశ్వర్, ఉపసర్పంచ్ అనిత, మహేందర్, పశువైద్యాధికారులు కిరణ్ దేశ్‌పాండే, ఉమామహేశ్వర్ న్నారు.

ఫత్తేపూర్, చేపూర్‌లలో..

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం ఫత్తేపూర్, చేపూర్ గ్రామాల్లో గురువారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నట్టల నివారణ మందులు వేశారు. పశు సంవర్ధక శాఖ అధికారి ప్రభాకర్ పాల్గొన్నారు.

శివాజీ విగ్రహ ఆవిష్కరణ



రాణాకలాన్‌లో ఆవిష్కరిస్తున్న ఎంపీ అర్వింద్

ఎడపల్లి(బోధన్) : రాణాకలాన్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని గురువారం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆవిష్కరించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రూ.4 లక్షలతో ఏర్పాటు చేశారు. అంతకు ముందు హిందూ సంఘాల ఆధ్వర్యంలో జానకంపేట్ నుంచి భారీ ర్యాలీ మధ్య ఎంపీ అర్వింద్‌కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డీ మోహన్ రెడ్డి, ఎడపల్లి మండల అధ్యక్షులు కమలాకర్ రెడ్డి, పార్టీ మాజీ మండల అధ్యక్షులు ఉప్పు సురేష్, గ్రామ సర్పంచ్ భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆకుల సురేష్, విగ్రహ ఆవిష్కరణ నిర్వహణ కమిటీ అధ్యక్షులు సూరకిరణ్, పిటకృష్ణ మహారాజ్, తదితరులు పాల్గొన్నారు.

బంగారు తెలంగాణ పేరుతో దోపిడీ



నాళేశ్వర్‌లో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్, పక్కన మేడపాటి, వడ్డీ మోహన్‌రెడ్డి

- ఎంపీ ధర్మపురి అర్వింద్

నవీపేట: రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ నేతలు నోట్ల కట్టలను తీసుకువచ్చి ఊర్లలో పంచుతారని, ఓటుకు రూ. వెయ్యి చొప్పున వసూలు చేయండని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నాళేశ్వర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బంగారు తెలంగాణ పేరుతో అక్రమంగా సంపాదించిన డబ్బులు మనవేనని, వాటిని తీసుకోవడంలో తప్పు లేదని చమత్కరించారు. ఆర్మూర్, బాల్కొండలో ఓటుకు రూ.10 వేలపైనే వసూలు చేయాలని సూచించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయని కేసీఆర్ దేశకీ నేత ముసుగుతో దేశాన్ని ఎలా ఉద్ధరిస్తారని ఎద్దేవా చేశారు. ఆసుపత్రిలో ఎలుకలు రోగులను కొరికేస్తున్నాయని.. వీధుల్లో కుక్కలు కాటేస్తున్నాయని.. ఇంట్లో దోమలు కుడుతున్నాయని వ్యాఖ్యానించారు. తెలంగాణలో కమలం పువ్వును గెలిపించాలని ప్రజల్ని కోరారు. బోధన్ నియోజకవర్గ నాయకులు వడ్డీ మోహన్‌రెడ్డి, మేడపాటి ప్రకాష్ రెడ్డి, సర్పంచ్ ద్యాగ సరిన్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్: తెలంగాణలో రోజురోజుకు మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరగుతున్నాయని, రక్షణ లేకుండా పోయిందని బీజేపీ ఆర్మూర్ అసెంబ్లీ మహిళ నాయకురాలు ఆలూర్ విజయభారతి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విజయభారతి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరి వల్లే మహిళలపై దాడులు జరుగుతున్నాయన్నారు. బీఆర్ఎస్ నాయకులు కొందరు బీజేపీ దేవరకొండ మండల మహిళా మోర్చ అధ్యక్షురాలు లక్ష్మీపై లైంగిక వేధింపులకు పాల్పడడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. అదేవిధంగా కేఎంసీ ఎంజీఎంలో లవ్‌జిహాద్ వేధింపులకు, ర్యాగింగ్‌కు గురైన పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నం చేయడం కలిచివేసిందన్నారు. ఇలాంటి దాడులకు పాల్పడుతున్న వారినే వెంటనే అరెస్టు చేసి శిక్షించాలన్నారు.